భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


సూర్యాపేటలో శిలువ మార్గం ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


నాగారం : ఫణిగిరిలో ఏసుక్రీస్తు వేషధారణలో శిలువ ప్రదర్శన..


ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్‌లో..


అర్వపల్లి : తిమ్మాపురంలోని చర్చిలో..

భానుపురి : గుడ్‌ఫ్రైడేను సూర్యాపేట పట్టణంలో క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా యేసు ప్రభువును శిలువ వేసిన రోజు, గుడ్‌ఫ్రైడే పవిత్రతను వివరిస్తూ సూర్యాపేట రోమన్ క్యాథలిజం విచారణ గురువు ఫాదర్ అసలు మరియన్న పరిశుద్ధ శిలువ మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ప్రపంచ మానవాళిని పాపముల నుంచి మన్నించుట కోసం యేసుక్రీస్తు శిలువ మరణం పొందారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏసుప్రభు చూపించిన ప్రేమ, దయ, కరుణ, జాలి మార్గంలో నడవాలన్నారు. పట్టణంలోని నిర్మల చర్చి నుంచి అంబేద్కర్ బొమ్మ, శంకర్ విలాస్, తెలంగాణ తల్లి బొమ్మ, కొత్త బస్టాండ్ సెంటర్ల మీదుగా నిర్మల హాస్పిటల్ వరకు శిలువ మార్గం కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బాలస్వామి, ముక్కల మల్రెడ్డి, నాగాటి ఏసుదాసు, బండ శ్యామ్, పిండిగ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : గుడ్‌ఫ్రైడేను జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసుప్రభువును శిలువ వేసిన రోజు కావడంతో శిలువలో ఏసుప్రభువు పలికిన ఏడు మాటలను ఈ సందర్భంగా క్రైస్తవులు ధ్యానించారు. అర్వపల్లి, రామన్నగూడెం, తిమ్మాపురం, జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్‌తోపాటు మండల వ్యాప్తంగా అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు కేలోతు చంద్రశేఖర్, పాస్టర్లు రేబల్లి దానియేలు, ఏసురత్నం, యోహాను, మందుల వెంకటయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ ఆదివారానికి ముందు వచ్చే శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటారని జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ పేర్కొన్నారు. యేసు క్రీస్తుకు శిలువ వేసిన రోజును పవిత్ర దినంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. తిరిగి ఆయన మూడవ రోజు సమాధి నుంచి బయటకు వస్తారని.. ఆ రోజును ఈస్టర్ పండుగగా జరుపుకోనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోజెస్, హోసన్నా, నాగరాజు, పేతురు, బాబు, సురేష్, యేసుపాదం, కళింగరెడ్డి, కిరణ్, అబ్రహం, పద్మ, వెంకన్న, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగారం : నాగారం మండలంలోని నాగారం, ఫణిగిరి, వర్ధమానుకోట, పస్తాల, ఈటూరు, పేరబోయినగూడెం తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫణిగిరి సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు శిలువ మోసే కార్యక్రమాన్ని ప్రదర్శించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చర్చీలలో భక్తులు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఏసుప్రభుకు శిలువ వేసిన రోజును స్మరిస్తూ విషాదాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘకాపరి రత్నాకర్, సంఘ సభ్యులు ముదిగొండ లాజర్, కర్నే మాణిక్యం, పెరుమళ్ల జాన్‌వెస్లీ, నీరుడు జోసెఫ్, యాట భాస్కర్, సుధాకర్, లక్ష్మయ్య, కిరణ్, యాకోబు, వెంకన్న, సామేల్, జయరాజ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని నెమ్మికల్‌లో ఏసుక్రీస్తు శిలువ మార్గాన్ని చేపట్టారు. అంతకు ముందు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోనీ సీఎస్ఐ చర్చిలో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో సీఎస్ఐ పాస్టర్ రెవ, డి.పురుషోత్తం, సాల్మన్, విజయ్, యాకూబ్, ప్రభుదాస్, లక్ష్మణ్, సందీప్, సునంద, సుకన్య, కళమ్మ పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో ఫాదర్ కిషోర్, సిస్టర్ స్వర్ణ, సబీనా, అంజయ్య, భిక్షం పాల్గొన్నారు.


అర్వపల్లి : రామన్నగూడెంలోని కల్వరి ప్రేమమందిరంలో ప్రార్థనలు


తిరుమలగిరిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


నూతనకల్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


అర్వపల్లిలోని బాప్టిస్టు చర్చిలో..


చివ్వెంల : ఖాసింపేటలోని బెతస్థ మినిస్ట్రీస్ మందిరంలో..


నాగారం : ఫణిగిరి సీఎస్ఐ చర్చిలో..

క్లుప్తంగా

పూల్‌సింగ్‌నాయక్ ఎన్నికపై హర్షం

అర్వపల్లి : రామన్నగూడెం గ్రామానికి చెందిన న్యాయవాది రమావత్ పూల్‌సింగ్‌నాయక్ తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావటం పట్ల శుక్రవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సామాజిక తెలంగాణ మహాసభ జిల్లా నాయకుడు దడిపల్లి వెంకట్, తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడు మేడిపల్లి వేణు, మరిపల్లి సురేష్, బైరబోయిన రాజు తదితరులు ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


నిత్యహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ అరవిందాచార్యులు, సుబ్రహ్మణ్యాచార్యులు, శ్రీమాన్ క్రిష్ణామాచార్యులు మంత్రోచ్చరణతో స్వామివారికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. స్వస్తివచనం, విన్నపాలు, తీర్థగోష్టి, నిత్యహోమం, శ్రీలక్ష్మీహయగ్రీవ హోమం, మహాపూర్ణహుతి, చక్రతీర్థం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు చకిలం క్రిష్ణకుమార్, డాక్టర్ ఆదుర్తి రామయ్య, బందకవి క్రిష్ణ మోహన్, మురళీ క్రిష్ణ, యలగబోయిన శ్రీరాములు, కైరోజు శంకరాచారి, నర్సయ్య, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన నాయకులు


హైదరాబాద్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డితో యూత్ కాంగ్రెస్ నాయకులు

తుంగతుర్తి : భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శుక్రవారం తుంగతుర్తి యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన అజయ్‌కుమార్, కొండ రాజు, జలేందర్, రమేష్, యాకన్న, రాము, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


ఆత్మకూరులో బోల్తాపడిన ట్రాక్టర్

ఆత్మకూర్ (ఎస్) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన జటంగి ముత్తయ్య ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా బోరింగ్ తండా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు మళ్లించారు. అయితే ఇసుక కేసు నుంచి తప్పించుకోవాలనుకున్న డ్రైవర్ ముత్తయ్య ఆత్మకూరు సమీపంలో ట్రాక్టర్‌ను చాకచక్యంగా పల్టీ కొట్టించి దూకేశాడు. దీంతో ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను రెవెన్యూ అధికారులకు పంపినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. ఇదే ట్రాక్టర్‌ను గురువారం ఇసుక తరలిస్తుండగా నూతనకల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

కొత్తగూడెంలో పశు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొత్తగూడెంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 110 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశువులకు తప్పనిసరిగా ఈ టీకాలను వేయించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, యాకయ్య, యాదగిరి, రైతులు వాక సైదులు, కె.రమేష్, పి.మురళి, ఎస్. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

చెరువులు, కుంటలకు చేరుతున్న జలాలు

అర్వపల్లి : యాసంగి సీజన్‌కు గాను చివరి విడతగా గోదావరి జలాలను విడుదల చేయగా నీళ్లు మైనర్, సబ్‌మైనర్ కాలువల ద్వారా చెరువులు, కుంటలకు చేరుతున్నాయి. 69, 70, 71 మూడు డిస్ట్రిబ్యూటర్లకు బయ్యన్నవాగు నుంచి 1810 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో మైనర్, సబ్‌మైనర్ కాలువల ద్వారా వాటి పరిధిలోని చెరువులు, కుంటలకు నీళ్లు పోతున్నాయి. డిస్ట్రిబ్యూటర్లకు నీటిని పెంచడంతో తూముల ద్వారా నీళ్లు చెరువులు, పంటపొలాలకు చేరుతున్నాయి. మొన్నటి వరకు నీళ్లు రాక ఎండిపోతున్న వరి పంటలకు చివరి విడతగా వదిలిన నీటితో కొంత ప్రాణం పోసినట్లయింది.

ముందు జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ


సర్వే నిర్వహిస్తున్న వైద్యులు

పెన్‌పహాడ్ : ముందు జాగ్రత్తలతో వ్యాధులను నివారించవచ్చని మండల వైద్యాధికారి స్రవంతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో నిర్వహించిన జ్వర బాధితుల సర్వేలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఇటీవల ఒకరికి డెంగీ జ్వరం రావడంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. అదే విధంగా గ్రామంలో ముగ్గురికి జ్వరాలు సోకడంతో ముందు జాగ్రత్త చర్యగా జ్వర పీడితుల సర్వే నిర్వహించి రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు రాకుండా నివారించవచ్చని తెలిపారు. గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు కాల్వల్లో టీమోపాస్ ద్రావణం పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓలు చంద్రశేఖరరాజు, శ్రీనివాస్, పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, ఏఎన్ఎంలు నసీమా, సుజాత, శారద, లక్ష్మి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

పెన్‌పహాడ్ : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లింగాల గ్రామంలో పోలీసు, పారామిలటరీ దళాలతో కవాతు నిర్వహించి ఓటర్లను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వేసినప్పుడే నిజమైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పెరిక రవీందర్, పారామిలటరీ సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి


సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలకు శాశ్వత పట్టాలను ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీపీఐఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడారు. గత ఏడేళ్లుగా ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక పోరాటాలు చేసినా గత పాలకులు పట్టించుకోలేదని అన్నారు. అంతేకాకుండా అక్రమ కేసులను బనాయించారని తెలిపారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని ఆ పత్రంలో కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి. వెంకటేశ్వర్ రావు, వాస పల్లయ్య, కొత్తపల్లి శివకుమార్, రేణుక, అఖిల్‌కుమార్, హుస్సేన్, కరుణాకర్ ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటా


అర్వపల్లి : కాసర్లపహాడ్‌లో లింగరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్


నూతనకల్ : శంభారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లం లింగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాలు విరిగింది. అలాగే గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు డాక్టర్ దిర్శనపు రాజేష్ కూడా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఇద్దరిని శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, నల్లగుంట్ల శ్రీనివాస్, యాదయ్య, జీడి వీరస్వామి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శంభారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు యాస శంభారెడ్డి(96) మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అతడి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, మహేశ్వరం చంద్రకళ, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, చురుకంటి చంద్రారెడ్డి, నెల్లుట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

మునగాల : మండలంలోని రేపాలలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గత ఆరు రోజులుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఆలయం ఆవరణలో ఎంపీపీ ఎలక బిందు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సారిక చిన రామయ్య చేతుల మీదుగా గురువారం రాత్రి బహుమతులు, షీల్డ్‌లు అందజేశారు. మొదటి బహుమతిని సూర్యాపేటకు చెందిన ఎస్ఎస్‌కే టీమ్, రెండవ బహుమతిని రేపాల ఆర్గనైజేషన్ టీమ్, మూడవ బహుమతిని నర్సింహులగూడెం బుల్లెట్స్ టీమ్, నాల్గవ బహుమతిని అంబేద్కర్ యూత్ నర్సింహులగూడెం టీమ్ అందుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న ధాన్యం

- జాజిరెడ్డిగూడెం మండలంలో ఈసారి 19 కేంద్రాలు
- రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు


అర్వపల్లిలోని కేంద్రంలో పోసిన ధాన్యం రాశులు

అర్వపల్లి : యాసంగి సీజన్ ధాన్యం సేకరణకు కేంద్రాల ఏర్పాటుకు ముందే.. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక మొదలైంది. రైతులు వరిపంటను కోయగానే ధాన్యాన్ని నేరుగా కేంద్రాలకు తెచ్చి పోస్తున్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల నందు ధాన్యం రాశులు పోసిపెట్టారు. అయితే గతంలో జాజిరెడ్డిగూడెం మండలంలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేశారు. అయితే ఈసారి 19 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో కన్నా ఈసారి ఒక కేంద్రం తగ్గింది. ఇందులో సెర్ప్ ఆధ్వర్యంలో 16, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 1, రైతు సంఘాల ఆధ్వర్యంలో 2 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఈసారి తగ్గనున్న ధాన్యం దిగుబడి..

ఈ యాసంగి సీజన్‌లో సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు వరి పంటలు సాగుచేశారు. అయితే సుమారు 3లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని, ఈ ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఈసారి గోదావరి జలాలు సక్రమంగా రాకపోవడంతో వరి పంటలు కొంతమేర ఎండిపోయాయి. దీంతో వరిపంట దిగుబడి తగ్గే అవకాశం కనిపిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రా రంభించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకనుగుణంగా కేంద్రాల ఏర్పాటుపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. గతంలో తలెత్తిన సమస్యలు మళ్లీ రాకుండా కేంద్రాల్లో వసతులు కల్పించాలని, లారీల కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రాలను ఏర్పాటు చేయాలి



“ ఈసారి వీలైనంత త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. గతంలో లారీల కొరత తదితర సమస్యలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.

– వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

16 కేంద్రాల ఏర్పాటు



“ సెర్ప్ ఆధ్వర్యంలో ఈసీజన్‌కు గానూ 16 కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఏప్రిల్ 1 నుంచి కేంద్రాలను ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– మల్లేష్, ఏపీఎం

ఇన్‌చార్జ్ ఎంపీఓగా దుర్గాప్రసాద్

నడిగూడెం : మండల ఇన్‌చార్జ్ ఎంపీఓగా నడిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ ఎస్.డి ఇమామ్ తెలిపారు. మండలంలో దుర్గాప్రసాద్ సీనియర్ పంచాయతీ కార్యదర్శి కావడంతో ఆయనను ఎంపీఓగా నియమించినట్లు పేర్కొన్నారు.

మసీద్‌కు కుర్చీల బహూకరణ

మునగాల : మండలంలోని మాధవరంలో గల మదీనా మసీద్‌కు అదే గ్రామానికి చెందిన గొట్టిపర్తి శ్రీరాములు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శుక్రవారం సుమారు రూ.35 వేల విలువ చేసే 60 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా దాత రాములును ముస్లింలు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ సదర్ షేక్ సైదా, ముస్లిం పెద్దలు హుస్సేన్, బుజ్జులు, బొజ్జమియా, నాగుల్, ఫకీర్, అహ్మద్ పాల్గొన్నారు.

1న బొడ్రాయి పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ 6వ వార్షికోత్సవాన్ని ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు బొడ్రాయి ప్రతిష్ఠ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ప్రచార రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. వార్షికోత్సవంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కమిటీ, ముత్యాలమ్మ కమిటీ, పునఃప్రతిష్ఠ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


మద్దిరాల : గోరెంట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ వెంకటయ్య

మద్దిరాల : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ వెంకటయ్య అన్నారు. శుక్రవారం గోరెంట్ల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్ గౌడ్, డైరెక్టర్ బద్దం సంజీవరెడ్డి, అశోక్, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో ఏపూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వినోద్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దివ్య, సీనియర్ అసిస్టెంట్ ఇంద్ర కుమార్, సంఘ కార్యదర్శి పట్నం లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు పనులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో ఈ సీజన్ నందు నూతనంగా ప్రారంభించే సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం నిర్వాహకులు కోరారు. సెర్ప్ కేంద్రం ఏర్పాటుకై శుక్రవారం గ్రామంలో స్థలాన్ని డోజర్‌తో శుభ్రం చేయించారు. రైతులు వరి కోయగానే ధాన్యాన్ని ఆరబోసి శుభ్రం చేసి కేంద్రానికి తేవాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు దేవరకొండ విజయ, బూర్గుల చంద్రకళ, సంఘబంధాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు శైలజ, స్వప్న, ధనమ్మ, అనిత, హైమావతి పాల్గొన్నారు.


ఆత్మకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు


తిమ్మాపురంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు డోజర్‌తో స్థలాన్ని శుభ్రం చేస్తున్న నిర్వాహకులు